క్లుప్తంగా

కోడిగుడ్ల సరఫరాకు టెండర్ల ఆహ్వానం

చీమకుర్తి: ఏపీ గురుకుల బాలుర పాఠశాల-గణపవరంకు కోడిగుడ్లు సరఫరా చేసేందుకు 2023-24 విద్యాసంవత్సరానికి ఆసక్తి కలిగిన వ్యక్తుల నుంచి టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు ఏపీ గురుకుల పాఠశాలల కన్వీనర్, సంతనూతలపాడు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వీ మెర్సీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత టెండర్ ఫారాలను సంతనూతలపాడు గురుకుల పాఠశాలలో ఈ నెల 28వ తేదీలోగా తీసుకుని 31వ తేదీ సాయంత్రం 4.30 గంటల్లోగా సంతనూతలపాడు గురుకుల పాఠశాలలో అందించాలన్నారు. దరఖాస్తులను పరిశీలించి ఆగస్టు 2వ తేదీ జాయింట్ కలెక్టర్ సమక్షంలో ఓపెన్ చేసి ఖరారు చేస్తారని తెలిపారు.

ప్రగడ కోటయ్యకు ఘన నివాళి



కోటయ్యకు నివాళులర్పిస్తున్న పద్మశాలి సేవా సంఘ సభ్యులు

చీమకుర్తి: చేనేత ఉద్యమ నాయకుడు, రాజ్యసభ మాజీ సభ్యుడు ప్రగడ కోటయ్య జయంతి సందర్భంగా చీమకుర్తిలో బుధవారం పద్మశాలీయుల సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. చేనేత సొసైటీ భవనం వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి పద్మశాలీయులకు ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా 150 మంది వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చేనేత సొసైటీ ప్రెసిడెంట్ అవ్వారు ఆదినారాయణ, పద్మశాలీయుల సంఘ జిల్లా అధ్యక్షుడు సోమా యానాదిశెట్టి, మున్సిపల్ కౌన్సిలర్లు గోపురపు రాజ్యలక్ష్మి, సోమా శేషాద్రి, ఎస్.హరిప్రసాద్, కొండా మోహన్‌రావు, మర్రి లక్ష్మీనారాయణ, గుండా చిన్న వెంకటేశ్వర్లు, స్థానికులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

కొత్తపట్నం: బాలిక అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. కొత్తపట్నం బీసీ కాలనీకి చెందిన గోనేపల్లి సుబ్బారావు కుమార్తె మంగళవారం ఇంటి నుంచి వెళ్లిపోయింది. బంధువుల ఇళ్లకు వెళ్లి వెతికినా కనిపించకపోవడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో తండ్రి సుబ్బారావు ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు రైటర్ రంగనాయకులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అందరూ విద్యావంతులు కావాలి



సరస్వతీదేవి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ చాపల వంశీకృష్ణ, శాంతకుమారి, గ్రామస్తులు

కె.పల్లెపాలెం (కొత్తపట్నం): అందరూ విద్యావంతులై జీవితంలో స్థిరపడి ఆర్థికంగా ఎదగాలని ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ చాపల శాంత కుమారి ఆకాంక్షించారు. ఎముకలు, కీళ్ల వైద్య నిపుణులు డాక్టర్ చాపల వంశీకృష్ణ సహకారంతో శ్రీరామ్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, శ్రీవాణీ విద్యానికేతన్ ఆధ్వర్యంలో పల్లెపాలెం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల (నార్త్)లె సుమారు రూ.లక్షతో సరస్వతీదేవి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. బుధవారం చాపల శాంతకుమారి చేతుల మీదుగా ఆవిష్కరించి మాట్లాడారు. సర్పంచ్ విశ్వనాథపల్లి ఆనందరావు, విగ్రహ దాతలైన చాపల వినుకొండయ్య, చాపల కోటేశ్వరరావు, చాపల శ్రీనివాసరావు, సంకే వెంకటేశ్వరమ్మ, పిన్ని వకుళాదేవి, సాదా దేవిక, మగతాల సుధాపద్మజను డాక్టర్ చాపల వంశీకృష్ణ అభినందించారు.

లోకేష్‌కు తప్పుడు సమాచారం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న దుంపా చెంచిరెడ్డి

చీమకుర్తి: సంతనూతలపాడులో జరుగుతున్న అభివృద్ధి పనులపై టీడీపీ స్థానిక నాయకులు నారా లోకేష్‌కు తప్పుడు సమాచారం అందించారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి అన్నారు. నారా లోకేష్ మంగళవారం సంతనూతలపాడు వచ్చిన సందర్భంగా స్థానిక టీడీపీ నాయకులు లోకేష్‌కు తప్పుడు సమాచారంతో అర్జీలిచ్చిన విషయంపై స్పందిస్తూ దుంపా చెంచిరెడ్డి బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. సంతనూతలపాడులో సీపీ డబ్ల్యూ స్కీం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో మంజూరైతే.. అది టీడీపీ హయాంలో మంజూరైనట్లు లోకేష్‌కు తెలిపారని ఎద్దేవా చేశారు. వైఎస్సార్ మంజూరు చేసిన తర్వాత ఆయన మరణం అనంతరం కాంగ్రెస్ పార్టీలో ఉన్న తాము వైఎస్సార్ సీపీలోకి వెళ్లామని గుర్తు చేశారు. తర్వాత సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో సంతనూతలపాడు సీపీ డబ్ల్యూ స్కీంకు పెద్ద చెరువులో శిలాఫలకం వేసి శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. కనీస సమాచారం తెలియని టీడీపీ నాయకులు.. వారి హయాంలో సంతనూతలపాడు ప్రజలకు తాగునీటిని వేళాపాళా లేకుండా నెలకోసారి ఇచ్చేవారని, స్వీపర్లకు జీతాలు రెండు సంవత్సరాలకు కూడా ఇచ్చే వారు కాదని ఎండగట్టారు. కార్యక్రమంలో దుంపా యలమందారెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలే ప్రభుత్వ లక్ష్యం

- ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి
- వలేటివారిపాలెం గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష ముగింపు

ఒంగోలు రూరల్:

అర్హులై ఉండి కూడా ఏదైనా పథకం వర్తించలేదని ఏ ఒక్కరూ బాధపడకూడదని, అర్హులందరికీ కుల, మత, వర్గ, రాజకీయాలకు అతీతంగా అన్ని పథకాలు అందాలనే లక్ష్యంతో జగనన్న ప్రభుత్వం పనిచేస్తోందని ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. ఒంగోలు మండలంలోని వలేటివారిపాలెం గ్రామ సచివాలయం పరిధిలో నెల రోజులుగా కొనసాగుతున్న జగనన్న సురక్ష ముగింపు కార్యక్రమం బుధవారం ఉదయం జరిగింది. గ్రామ సర్పంచ్ నలమోతు ఉషారాణి అధ్యక్షతన ఒంగోలు ఎంపీడీవో పి.అజిత కన్వీనర్‌గా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బాలినేని ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నెలరోజులుగా వలంటీర్లు, సచివాలయ సిబ్బంది సంయుక్తంగా ఇంటింటి సర్వే నిర్వహించి అర్హుల జాబితా రూపొందించారన్నారు. ఆ జాబితా ప్రకారం అర్హులై ఉండి సర్టిఫికెట్లు లేక పథకాలు పొందలేని వారి కోసం మొత్తం 11 రకాల సర్టిఫికెట్లను అందజేస్తున్నట్లు తెలిపారు. వలేటివారిపాలెంలో 909 కుల ధ్రువీకరణ పత్రాలు, 919 ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఐటీ 1, సీసీఆర్‌సీ 16 పత్రాలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వంలో ఒక ధ్రువీకరణ పత్రం పొందాలంటే స్థానిక టీడీపీ నాయకుల సిఫార్సుతో రోజులపాటు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేదని బాలినేని గుర్తుచేశారు. ఒక పెన్షన్ నూతనంగా పొందాలంటే ఎవరైన పెన్షన్‌దారుడు మృతిచెందితే అతని స్థానంలో ఇచ్చేవారన్నారు. అది కూడా జన్మభూమి కమిటీ సభ్యుల వద్ద పడిగాపులు కాస్తేనే వచ్చేదన్నారు. ప్రస్తుతం అవన్నీ వెంటనే ఇళ్లవద్దకే అందుతున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల కష్టాలు, కన్నీళ్లను దగ్గరగా చూసి సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థలను ఏర్పాటు చేసి సర్వేలు చేసి ప్రజల అవసరాలు తీరుస్తున్నారన్నారు. తాను ఐదుసార్లు పోటీ చేసి నాలుగుసార్లు గెలిచానని, వలేటివారిపాలెం ఓటింగ్‌పై తనకు పూర్తిగా అవగాహన ఉందని తెలిపారు. అనంతరం 1800 మందికిపైగా ధ్రువీకరణ పత్రాలు, డ్వాక్రా మహిళలకు రుణాల చెక్కులను ఎమ్మెల్యే బాలినేని అందజేశారు. ఎంపీపీ పల్లపోలు మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ తాగునీరు, రోడ్ల సమస్యను ఎమ్మెల్యే పరిష్కరించారని, నూతనంగా పీహెచ్‌సీని ప్రారంభించి వైద్య సౌకర్యం కల్పించారని తెలిపారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చుండూరి రవి విజ్ఞప్తి మేరకు వలేటివారిపాలెం నుంచి దశరాజుపల్లె వరకు ఉన్న డొంకరోడ్డును తారురోడ్డుగా మార్చే ప్రతిపాదనలు పంపాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. సర్వేరెడ్డిపాలెం నుంచి ఒంగోలు వరకు రోడ్డు మంజూరు చేయాలని చుండూరి రవి, దశరాజుపల్లె సర్పంచ్ శ్రీలక్ష్మి, వలేటివారిపాలెం సర్పంచ్ ఉషారాణి విజ్ఞప్తిచేయగా, వెంటనే సర్వే చేసి ప్రతిపాదనలు పంపాలని, ఎమ్మెల్యే నిధుల నుంచి ఈ రెండు రోడ్లు మంజూరు చేయిస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ అధ్యక్షుడు కుప్పం ప్రసాద్, ఒంగోలు వ్యవసాయాధికారి కిషోర్‌బాబు, ఒంగోలు తహసీల్దార్ పి.మురళి, ఒంగోలు మాజీ వైస్ ప్రెసిడెంట్ నలమోతు రాఘవరావు, హౌసింగ్ డీఈ నారాయణరెడ్డి, వైఎస్సార్ సీపీ రూరల్ కన్వీనర్ రాయపాటి అంకయ్య, కరవది ఎంపీటీసీ మన్నె శ్రీనివాసరావు, ఏపీఎం గోపీనాథ్, వైస్ ఎంపీపీ ఉషారాణి, దశరాజుపల్లి వైఎస్సార్ సీపీ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి మాట్లాడారు.

బాలినేనిని కలిసిన మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్...

ఒంగోలు అర్బన్: స్థానిక ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ సుధాకర్‌బాబు బుధవారం ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా మెడికల్ కాలేజీలో పరిస్థితులను అడిగి బాలినేని తెలుసుకున్నారు. త్వరలో విద్యార్థులు, సిబ్బందితో మాట్లాడి మెడికల్ కాలేజీలో ఏవైనా సమస్యలుంటే పరిష్కరించి కాలేజీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ప్రిన్సిపాల్‌తో పాటు డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, తిరుమలరావు ఉన్నారు. కాగా, ప్రభుత్వ మెడికల్ కాలేజీలో 2019 బ్యాచ్‌కు చెందిన విద్యార్థి అభిజిత్‌కు కమ్యూనిటీ మెడిసిన్ విభాగాల్లో పరిశోధన చేసేందుకు రూ.10 వేలు పారితోషకాన్ని కాలేజీలో ప్రిన్సిపాల్ అందజేశారు.



వలేటివారిపాలెంలో ప్రజలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి



బాలినేనిని సన్మానిస్తున్న మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ సుధాకర్

ఇండెల్ మనీ లిమిటెడ్ సంస్థ బ్రాంచ్‌ని ప్రారంభించిన బాలినేని...

ఒంగోలు: స్థానిక అరవై అడుగుల రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ఇండెల్ మనీ లిమిటెడ్ సంస్థ నూతన బ్రాంచ్‌ని ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, నగర మేయర్ గంగాడ సుజాత బుధవారం ప్రారంభించారు. ప్రజలకు మంచి సేవలు అందించాలని బాలినేని సూచించారు. ఈ సందర్భంగా బాలినేనిని వారు సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ జోనల్ హెడ్ రమేష్‌రాజు మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలో బంగారంపై రుణాలు అందించే వ్యాపారంలో 255 శాఖలతో తమ సంస్థ అగ్రస్థానంలో ఉందన్నారు. కార్యక్రమంలో జోనల్ ఆపరేషన్ హెడ్ ఎల్.జాలిరెడ్డి, ఏరియా మేనేజర్ భాస్కర్, రాష్ట్ర టైలరింగ్ బోర్డు చైర్మన్ షేక్ సుభాన్ బీ, 49వ డివిజన్ కార్పొరేటర్ అంగిరేకుల గురవయ్య, వైఎస్సార్ సీపీ సాంస్కృతిక విభాగం రీజినల్ కోఆర్డినేటర్ బొట్ల సుబ్బారావు, నాయకులు గొర్రెపాటి శ్రీనివాసరావు, బత్తుల కాశయ్య, వేమూరి మాల్యాద్రి, రాంబాబు, ప్రసాదరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హత్యకు గురైన దళితుడి కుమారుడికి ఉద్యోగం



రిలీఫ్ ఉత్తర్వులు అందజేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు టౌన్: హత్యకు గురైన దళితుడి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అపన్నహస్తం అందించింది. ఒంగోలు నగరంలోని రాంనగర్ మూడో లైన్‌లో నివశించే బండి చెంచురత్నం గతేడాది డిసెంబరులో హత్యకు గురికాగా, ఆయన భార్య కోటేశ్వరికి నష్టపరిహారంతో పాటు పెన్షన్, కుమారుడు సుధీర్‌కు జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం ఇస్తూ కలెక్టర్ దినేష్‌కుమార్ జారీచేసిన ఉత్తర్వులను బుధవారం కలెక్టర్ కార్యాలయంలో అందజేశారు. ఉలవపాడు మండలం రామాయపట్నం గ్రామానికి చెందిన చెంచురత్నం జీవనోపాధి వెతుక్కుంటూ ఒంగోలు చేరుకున్నాడు. నగరంలోని రాంనగర్ మూడో లైనులో టీ దుకాణం పెట్టుకుని జీవిస్తున్నాడు. అదే వీధిలోని రమాదేవికి చెందిన 4 అంతస్తుల భవనం గ్రౌండ్ ఫ్లోర్‌లో నివాసం ఉంటున్నాడు. అదే భవనంలోని 4వ అంతస్తులో షేక్ బాజీ అనే ఆటోడ్రైవర్ కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నాడు. ఒక కేసులో బాజీ అడ్రస్ వెతుక్కుంటూ వచ్చిన పోలీసులు చెంచురత్నంను వివరాలడిగారు. దాంతో ఆయన వారికి బాజీ అడ్రస్ చెప్పాడు. ఇది మనసులో వుంచుకున్న బాజీ.. టీ దుకాణం వద్దకు వెళ్లి తరచూ ఘర్షణకు దిగేవాడు. ఈ క్రమంలో గతేడాది డిసెంబర్ 11వ తేదీ రాత్రి 9 గంటల సమయంలో తన ఇంటి ఎదురుగా మరో వ్యక్తితో గొడవ పడుతున్న బాజీని చెంచురత్నం వారించాడు. ఆగ్రహానికి గురైన బాజీ ఆయన మీద దాడికి తలపడ్డాడు. ఇంటి యజమాని రమాదేవి రావడంతో వెళ్లిపోయాడు. ఇంటి ముందు నిలబడి రమాదేవితో జరిగిన విషయాన్ని చెబుతుండగా డాబాపై అంతస్తు మీద నుంచి కొండరాయిని చెంచురత్నం మీదకు విసిరాడు. నేరుగా తలమీద రాయి పడడంతో తీవ్రంగా గాయపడిన చెంచురత్నం చికిత్స పొందుతూ మరసటిరోజు మృతిచెందాడు.

కుమారుడికి ఉద్యోగం...

దళిత కుటుంబానికి చెందిన చెంచురత్నం హత్యకు గురవడంతో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఈ కేసులో నష్ట పరిహారం కింద మృతుడి భార్య కోటేశ్వరికి రూ.8.25 లక్షలు, నెలనెలా రూ.5 వేల పెన్షన్ మంజూరు చేశారు. కుమారుడు సుధీర్‌కు జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం ఇస్తూ జారీ చేసిన ఉత్తర్వులను కలెక్టర్ దినేష్ కుమార్ అందజేశారు. కార్యక్రమంలో దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు, మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు దారా అంజయ్య, జనమాల నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ కనబరిచిన పేస్ విద్యార్థులు



ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న పేస్ కాలేజీ కరస్పాండెంట్ శ్రీధర్

ఒంగోలు: స్థానిక పేస్ ఇంజినీరింగ్ కాలేజీ సివిల్ ఇంజినీరింగ్ విభాగం విద్యార్థులు సత్తాచాటారు. నెల్లూరు నారాయణ ఇంజినీరింగ్ కాలేజీలో నేషనల్ లెవల్ టెక్నికల్ సింపోజియంలో భాగంగా నిర్వహించిన క్విజ్ పోటీల్లో పాల్గొని ప్రథమ, తృతీయ స్థానాలు కైవసం చేసుకున్నారు. సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో చివరి సంవత్సరం చదువుతున్న కె.ప్రసన్నకుమార్, ఎం.పవన్‌కుమార్, బి.గురుభార్గవ్, డి.రాహుల్‌కుమార్ (ప్రథమ), ఎం.సాయిశివాని, షేక్ నాగూర్‌బీ, ఎం.అమూల్య, పి.వర్షిత (తృతీయ) స్థానం సాధించారు. ఈ సందర్భంగా కాలేజీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ బుధవారం కాలేజీలో విద్యార్థులను అభినందించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జేవీకే మూర్తి, డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ అండ్ అడ్మిషన్స్ డాక్టర్ ఆర్.వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ పంటల పరిశీలన



ప్రకృతి వ్యవసాయంతో సాగుచేస్తున్న వేరుశనగ పైరును పరిశీలిస్తున్న గుజరాత్ ఐఐఎంఏబర్డ్ సంస్థ ప్రతినిధులు

కొత్తపట్నం: మండలంలోని రంగాయపాలెం గ్రామంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండిస్తున్న పంటలను గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్ నుంచి వచ్చిన ఐఐఎంఏబర్డ్ సంస్థ, ఉపాసన సురభి సభ్యులు, రైతు సాధికార సంస్థ డాక్టర్ రాజగోపాల్, జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగం మేనేజర్ వి.సుభాషిణి బుధవారం పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వ పాఠశాలను సందర్శించి ఏయే కూరగాయలు పిల్లలకు వండిపెడుతున్నారని అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు ప్రకృతి వ్యవసాయంతో పండించిన ఆకుకూరలు, కూరగాయలు, ధాన్యాన్ని వండిపెట్టాలని ఆదేశించారు. చిన్న వయసు నుంచే అలాంటి ఉత్పత్తులు అలవాటుచేస్తే వ్యాధి నిరోధక శక్తి పెరగడమే కాకుండా ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. అనంతరం మహిళా సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. అందరూ ప్రకృతి వ్యవసాయంతో పండించిన ధాన్యం, ఆకుకూరలు, కాయగూరలు తింటున్నారా, కాంప్లెక్స్ ఎరువులతో పండించిన పంటలు తింటున్నారా అని అడిగి తెలుసుకున్నారు. అందరూ ప్రకృతి వ్యవసాయంతో పండించిన వాటినే తినాలని కోరారు. వారి అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాదర్తి, రంగాయపాలెం, కొత్తపట్నం న్యూట్రి గార్డెన్, కిచెన్ గార్డెన్‌ను పరిశీలించారు. పనితీరు, దిగుబడి గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మహేష్, నరసింహులు, అపర్ణ, శిరీష, ఐసీఆర్‌పీలు, రైతులు పాల్గొన్నారు.

రూ.33 కోట్లతో పేర్నమిట్ట అభివృద్ధి

- ఒంగోలు కార్పొరేషన్ మేయర్ గంగాడ సుజాత
- జగనన్న సురక్షలో 3,556 సర్టిఫికెట్ల పంపిణీ



సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న మేయర్ గంగాడ సుజాత

చీమకుర్తి: ఒంగోలు కార్పొరేషన్‌లోని పేర్నమిట్టలో గల 40, 41, 42 డివిజన్లలో రూ.33 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించినట్లు మేయర్ గంగాడ సుజాత తెలిపారు. బుధవారం స్థానిక శాంతినగర్‌లో ఆయా డివిజన్ల కార్పొరేటర్లు నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో గంగాడ సుజాత ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సంక్షేమ పథకాలు పొందేందుకు అవసరమైన 11 రకాల సర్టిఫికెట్లను జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అధికారుల సహకారంతో ఉచితంగా లబ్ధిదారులకు అందిస్తున్నట్లు తెలిపారు. అందలో భాగంగా మూడు డివిజన్లలో కలిపి 3,556 సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. స్థానిక కార్పొరేటర్ నూకతోటి మస్తానమ్మ ఈశ్వరరావు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో కార్పొరేటర్లు తేళ్ల చంద్రశేఖర్, కత్తినేని విజయ్‌భరత్‌రెడ్డి, మున్సిపల్ ఎంఈ మాల్యాద్రి, మెప్మా మేనేజర్ కొండయ్య, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనపై న్యాయవాదుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

ఒంగోలు: మణిపూర్‌లో మహిళలపై జరిగిన అత్యాచార ఘటనను ఖండిస్తూ న్యాయవాదులు స్థానిక జిల్లా న్యాయస్థానం వద్ద బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఒంగోలు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నల్లూరు సత్యశ్రీనివాస్ మాట్లాడుతూ మణిపూర్‌లో జరిగిన అత్యాచార ఘటన యావత్ దేశాన్ని తీవ్రంగా క్షోభింపజేసిందన్నారు. ఇటువంటి ఘటనలు జరగడం బాధాకరమని, ప్రభుత్వం తక్షణమే ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు. దీనిపై కేంద్రం వెంటనే స్పందించాలని, మణిపూర్ ప్రభుత్వం కూడా సీరియస్‌గా తీసుకుని నిందితులను కఠినంగా శిక్షించేలా, బాధిత కుటుంబాలకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గిరీష్‌కుమార్, ఎస్‌కే ఉస్మాన్ సాహెబ్, దేవకుమారి, దీపులత, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

అర్హులంతా ఓటర్లుగా నమోదు కావాలి



సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

- కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: అర్హులైన ప్రతిఒక్కరూ ఓటర్లుగా నమోదు కావాలని, ఆ దిశగా సంబంధిత అధికారులు, సిబ్బంది, రాజకీయ పార్టీలు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ దినేష్‌కుమార్ సూచించారు. బుధవారం ప్రకాశం భవనంలో స్పెషల్ సమ్మరి విజన్-2024పై సంబంధిత అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితాపై నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను పారదర్శకంగా చేసి ఓటర్ల జాబితాను పక్కాగా రూపొందించాలన్నారు. ఓటర్ల జాబితాలోని సవరణలు, డిలిషన్, యాడింగ్స్, మైగ్రేషన్ వంటివి పక్కాగా పరిశీలించాలన్నారు. ఓటుకు ఆధార్ అనుసంధానం చేసేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. రాజకీయ పార్టీలు సహకరించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో ఆర్.శ్రీలత, ఎలక్షన్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకుడు దామరాజు క్రాంతికుమార్, ఇతర పార్టీల నుంచి కాలేషాబేగ్, రాజశేఖర్, సత్యం, వినోద్, శ్రీనివాసరావు, వెంకటస్వామి, శ్రీనివాసరావు, ఎలక్షన్ డీటీ రఫీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో యాదవులకు ప్రాధాన్యత ఇవ్వాలి

ఒంగోలు టౌన్: రాబోయే సాధారణ ఎన్నికల్లో యాదవులకు తగిన ప్రాధన్యత ఇవ్వాలని యాదవ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు మిరియం శ్రీనివాస్ కోరారు. బుధవారం యాదవ జేఏసీ కార్యాయలంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ప్రసంగించారు. జిల్లాలో రెండు అసెంబ్లీ, ఒక పార్లమెంటు స్థానాన్ని యాదవులకు కేటాయించాలని ప్రధాన రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో యాదవులు బలంగా ఉన్నారని చెప్పారు. వారి మద్దతు లేకుండా ఏ పార్టీ విజయం సాధించడం అసాధ్యమన్నారు. సమావేశానికి జేఏసీ జిల్లా అధ్యక్షుడు గోపీకృష్ణయాదవ్ అధ్యక్షత వహించగా అప్పారావు, లక్ష్మీవెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

హడావిడి ఎక్కువ.. జనం తక్కువ



మంగమూరు రోడ్డులో ఇరువైపులా రోడ్డుపైకి కట్టిన టీడీపీ ఫ్లెక్సీలు



మద్యం తాగుతున్న టీడీపీ కార్యకర్తలు

- సాదాసీదాగా లోకేష్ పాదయాత్ర
- తాగి ఊగిన తెలుగు తమ్ముళ్లు

ఒంగోలు అర్బన్: పేరు గొప్ప.. ఊరు దిబ్బ అన్నట్లుంది నారా లోకేష్ పాదయాత్ర. గొప్పగా చెప్పుకోవడం తప్ప పాదయాత్రలో పస లేదనేది ఒంగోలులో తేలిపోయింది. యువగళం పేరుతో లోకేష్ చేస్తున్న పాదయాత్ర బుధవారం ఒంగోలులోని కర్నూలు రోడ్డు నుంచి ప్రారంభమై ఈవినింగ్ వాక్‌లా సాగింది. ప్రారంభ స్థలం నుంచి సభ ఏర్పాటు చేసిన మంగమూరు రోడ్డు వరకు ఎవరో వెనక తరుముతున్నట్లు వేగంగా నడుచుకుంటూ వెళ్లిపోయారు లోకేష్. కేవలం మార్గం మధ్యలో క్రేన్‌లతో ఏర్పాటు చేసిన పూలమాలలు వేయించుకోవడం, ఫొటోలకు స్టిల్స్ ఇవ్వడం తప్ప ఎక్కడా ప్రజలను పలకరించిన దాఖలాలు లేవు. కర్నూలు రోడ్డు నుంచి పలు ప్రాంతాల్లో టీడీపీ నేతలు ఏర్పాటు చేసిన వారితో తప్ప సాధారణ ప్రజలతో పలకరింపు లేకుండా కార్యక్రమం కొనసాగింది. దీంతో ప్రజలు ఇదేం పాదయాత్ర అంటూ ముక్కున వేలుసుకున్నారు. భారీ సౌండ్‌లు, డప్పులతో హడావిడి తప్ప చెప్పుకోదగిన స్థాయిలో జనం రాకపోవడం టీడీపీ శ్రేణులను నిరాశపరించింది. రెండు చోట్ల 108 వాహనాలకు అంతరాయం ఏర్పడటంతో నగరంలోని సందుల్లో నుంచి ఆస్పత్రులకు చేరాయి. స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి సాధారణ కార్యక్రమానికి వచ్చినంత మంది కూడా లోకేష్ పాదయాత్రకు రాలేదని టీడీపీ వర్గాల్లోనే గుసగుసలు వినిపించాయి. మంగమూరు రోడ్డులో రోడ్డుకు ఇరువైపులా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి ప్రజలను బంధించినట్లు సభ నిర్వహించారు. ఊకదంపుడు ఉపన్యాసలతో విసిగెత్తిన ప్రజలు బయటకు వెళ్లేందుకు పోటీపడ్డారు. సత్తా లేని ప్రసంగాలు ఉండటంతో ఫ్లెక్సీలను చించివేసి మరీ ప్రజలు వెళ్లిపోయారు. కొందరు తెలుగు తమ్ముళ్లు విచక్షణా రహితంగా మద్యం తాగి ఊగిపోయారు.

కొత్తపట్నం మండలం నుంచి బలవంతంగా జనం తరలింపు...

కొత్తపట్నం: ఒంగోలులో లోకేష్ పాదయాత్రకు కొత్తపట్నం మండలం నుంచి బలవంతంగా జనాన్ని తరలించారు. టీడీపీ కార్యకర్తలు ఇంటింటినీ జల్లెడపట్టి.. తాము రాలేమని మహిళలు అంటున్నా ఒక్కొక్కరికీ రూ.200 ఇచ్చి బలవంతంగా ఒంగోలు తీసుకెళ్లారు. వారికి సరైన వసతులు కల్పించకపోవడంతో ఇబ్బందిపడ్డారు. నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయ లోపంతో కొన్ని గ్రామాల వారు కార్యక్రమానికి దూరంగా ఉండిపోయారు. బస్సులన్నింటినీ చింతల సమీపంలోని టిడ్కో ఇళ్ల వద్ద ఆపి రూ.200 ఇచ్చి యువగళానికి పంపించారని సమాచారం.

విపత్తులకు కేంద్రం సాయంపై పార్లమెంట్‌లో ఎంపీ మాగుంట ప్రశ్న

ఒంగోలు: విపత్తుల నష్టాల అంచనా, కేంద్రం అందించే సహాయంపై పార్లమెంట్‌లో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి బుధవారం ప్రశ్నలేవనెత్తారు. దేశంలో విపత్తులు సంభవించిన ప్రాంతాల్లో జరిగిన నష్టాల అంచనాకు వచ్చే బృందాల ఏర్పాటు సమయం, కచ్చితమైన నష్ట ప్రాంతాల గుర్తింపు కాలపరిమితి, సకాలంలో సరుకుల రవాణా, నిల్వ సదుపాయాలు, నష్ట ప్రాంతాల అంచనాలకు అవలంబించే పద్ధతులు మెరుగుపరచడం వంటి అంశాలపై ఎంపీ అడిగిన ప్రశ్నకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ సమాధానమిచ్చారు. విపత్తుల నిర్వహణ బాధ్యత రాష్ట్రాలకు సంబంధించినదని అన్నారు. కేంద్రం ఆమోదించిన అంశాలు, నిబంధనల ప్రకారం ప్రకటించిన ప్రకృతి వైపరీత్యాల బాధిత ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్ర విపత్తు స్పందన నిధి నుంచి ఆర్థిక సాయం అందిస్తాయన్నారు. తీవ్రమైన విపత్తులు సంభవించినప్పుడు కేంద్ర బృందం సిఫార్సుల మేరకు కేంద్ర విపత్తు స్పందన నిధి నుంచి అదనపు ఆర్థికసాయాన్ని కేంద్రం నేరుగా బాధితులకు అందిస్తుందని తెలిపారు. విపత్తు నష్టాలను త్వరితగతిన అంచనా వేసి ఆర్థిక సాయం రాష్ట్రాలకు అందజేసేందుకు కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఏర్పాటుచేసిన బృందాలు సంబంధిత మంత్రిత్వ, ప్రభుత్వ శాఖల బాధ్యతలను కూడా కలిగి ఉంటాయని, వ్యవసాయం, విద్యుత్, గ్రామీణాభివృద్ధి, నీటిపారుదల, రోడ్డు రవాణా, తదితర అంశాలకు సంబంధించి జరిగిన నష్టాల అంచనాలను కేంద్ర, రాష్ట్ర శాఖలు అందించిన సమాచారం, పరికరాలపై ఆధారపడి రాష్ట్రాలతో సంప్రదించి నిర్ణయిస్తామని కేంద్ర హోంశాఖ సహాయక మంత్రి నిత్యానంద్‌రాయ్ సమాధానం ఇచ్చారు.